


# 16

## చిలుకూరి దేవపుత్ర

నేను చిన్నప్పటి నుంచి చాలా సున్నిత మనస్కుడిని. ఎవరు ఏ చిన్న విమర్శ చేసినా చాలా బాధపడతాను.

అందుకే ఆవేళ రాత్రి – "నీ పిల్లలు పెద్దయినాక నిన్ను క్షమించరురా! కచ్చితంగా తిడతారు!" అన్న రాజేంద్రగాడి మాటలు నాతలలో గింగర్లు కొడుతూ ఉన్నాయి.

అటూ ఇటూ పక్కమీద పొర్లుతున్నానే కానీ నిద్రపట్టడం లేదు. వనజ ఎప్పుడో నిద్రపోయింది. ఏమయింది నాకు? ఏదో పిరికితనం ఆవహించిందా?

రాజేంద్రగాడు ఏదో అన్నాడు. అంటేమటుకూ అవన్నీ నిజాలా? ఏం కాదు నేను, నా పిల్లల పెంపకంలో ఎక్కడా రాజీపడలేదు అని సర్దిచెప్పుకుంటున్నాను.



# రెండు ఉత్తరాలు

నేను ఇంత మదనపడిపోవడానికి కారణం - ఆ సాయంత్రం రాజేంద్రతో కలిసి వాళ్ళ ఇంట్లో మాట్లాడిన మాటలే.

రాజేంద్ర నా క్లాసుమేటు. అంతేకాదు పన్నెండో తరగతి వరకూ ఇద్దరం ఒకే బెంచీలో కూచునేవాళ్లం. మా ఇద్దర్నీ జంటకవులని పిలిచేవాళ్లు మా క్లాసుమేట్సు. ఆ తర్వాత వాళ్ల నాన్నకి హైదరాబాదుకి బదిలీ అవడంతో, వాడు గ్రాడ్యుయేషన్ హైదరాబాద్‌లోనే పూర్తిచేశాడు. అక్కడే సెక్రటేరియట్‌లో క్లర్కుగా చేరాడు. అక్కడే పెళ్లి కూడా చేసుకున్నాడు. అయితే, వాళ్ల చిన్నాన్న వాళ్లు అనంతపురంలోనే ఉండడంతో అప్పుడప్పుడు ఇక్కడికి వస్తుంటాడు - ఏపండగలకో పెళ్ళిళ్లకో.

వనజను నిద్రలేపి నాలో ఉన్న బాధనంతా చెప్పలేను. మరేం చేసేది?

అప్పుడు వచ్చింది ఒక ఆలోచన...

నాలోని ఆవేదనంతా ఒక కాగితం మీద పెట్టాలని. అనుకున్నదే తడవుగా లేచికూచున్నాను. అప్పుడు సమయం పదకొండు అయింది. అప్పటికే పిల్లలిద్దరూ బయట గదిలో నిద్రపోతూ ఉన్నారు.

ఉత్తరం రాయడం ప్రారంభించాను.

"వనజా!

ఒకే ఇంట్లో ఉంటూ ఇట్లా ఉత్తరాలు రాయడం నీకు వింతగా అనిపిస్తుందని నాకు తెలుసు. కానీ ఈ వేళప్పుడు నిన్ను నిద్రలేపి, అసలే 'బీపీ' ఉన్న నీకు మరింత అనారోగ్యాన్ని కలిగించడం ఇష్టంలేక ఇట్లా ఉత్తరం రాస్తున్నా. ఈ రోజు నాకూ, రాజేంద్రగాడికీ మధ్య జరిగిన సంభాషణ నన్ను తీవ్రమైన ఆవేదనకు గురిచేసింది. నీతో జరిగిందంతా చెప్పుకుని ఉపశమనం పొందాలని ఇంటికి వచ్చేటప్పటికీ నువ్వు నిద్రపోతున్నావు. అందుకే ఈ ఉత్తరం.

'ప్రపంచమంతా నాగరికతతో శరవేగంతో ముందుకు దూసుకుపోతూ ఉంటే నువ్వేందిరా! దద్దమ్మ మాదిరి వెనక్కినడుస్తున్నావ్? నీ ఆదర్శాలూ, ఆశయాలూ, పిల్లలకి తిండిపెడతాయా? అసలు నువ్వేం చేస్తున్నావో అర్థమౌతోందా? ఏం దేశభక్తిరా నీది? పిల్లల్ని తెలుగుమీడియంలో చదివిస్తార్రా ఎవరయినా? ఏదో పూర్తి గతిలేని వాళ్లలాగా గవర్నమెంటు స్కూల్లోనా చదివించడం? వాళ్లని ఏం చేద్దాం అనుకున్నావ్? మాతృభాషలో విద్యాబోధన తల్లిపాలా? ఇంగ్లీషు మీడియం పోతపాలా? నీకు తెలీదురా ఓరేయ్! ఇప్పట్లో తల్లులెవ్వరూ తమపాలు తాగించడం లేదురా! పూర్వకాలమంత ఆరోగ్యంగా వాళ్లు ఎక్కడున్నారు పాపం! పోతపాలే పిల్లలకి గతి!

గ్లోబలైజేషన్ ప్రభావంతో ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారిపోతూ ఉంటే, ఈ అనంతపురాన్నే ప్రపంచంగా ఫీలయిపోతున్నావ్! బావిలో కప్పవిరా నువ్వు!'

ఇవీ వాడు నన్ను అన్న మాటలు - క్లుప్తంగా...

'నేను శాస్త్రీయంగానే పిల్లల్ని పెంచుతున్నానురా! ప్రాథమికస్థాయి విద్యాబోధన అన్నది మాతృభాషలోనే ఉండాలన్నది ప్రపంచంలోని విద్యావేత్తలందరూ చెబుతున్న విషయం. జర్మనీ, జపాన్, చైనాలాంటి దేశాల్లో అయితే సాంకేతిక విద్యకూడా వాళ్ల మాతృభాషల్లోనే ఉందిరా!' అని నేను వాడి దాడిని ఎదుర్కోబోయాను.

'నీ మోహం ఇది ఇండియారా! ఇక్కడ అంత ఎదిగిన భాషలు లేవు. మన పిల్లలు కూడా ఇంగ్లీషు భాషకు అలవాటయిపోయారు' అంటూ తిరిగి నాపై దాడి చేశాడు! అంతటితో ఆగలేదు - 'చదువుకునేటప్పుడు బాగా తెలివిగా ఉండేవాడివి. ఇప్పుడేమయింది నీకు చివరికి ఇంట్లో' 'అమ్మానాన్నా' 'అంటూ పిల్లలతో ఆ పిలుపులేమిటి? నీకు మతేమయినాపోయిందా? రేప్పొద్దున్న ఈ సొసైటీలో నీ పిల్లలు తలెత్తుకుని తిరగ్గలరేంరా! నీ తప్పు ఇప్పుడు కాదు తెలిసేది. ఇంకో ఆరేడు సంవత్సరాల తర్వాత, అప్పటికి వాళ్లకి పోస్టు గ్రాడ్యుయేషన్ ముగిసి వుంటుంది. ఆ రోజు నిన్ను వాళ్లు ఖచ్చితంగా తిడతారు. నీ తప్పుని వాళ్లు క్షమించరు. ఇది నూటికి నూరు పాళ్ళూ నిజమవుతుందిచూడు! ఆరోజు నువ్వు ఎంత పశ్చాత్తాపబడినా లాభం లేదు. అప్పటికి చేతులు కాలి ఉంటాయి 'కదా! ఆకులు పట్టుకుని ఏం లాభం. నీలాంటి మూర్ఖుడికి పిల్లలుగా పుట్టడం వాళ్లు చేసుకున్న పాపం అంతే!' అంటూ ఇంతెత్తునా ఎగిరిపడ్డాడు.

వాడు ఎంత సీరియస్‌గా మాట్లాడినా నేను ఎప్పుడూ బాధపడలేదు వనజా! ఈ సారి వాడు నా వ్యక్తిగత జీవితంలోకి దూరి మాట్లాడాడు. నా పిల్లల్ని నేను ఎంతో జాగ్రత్తగా పెంచుకున్నానన్న నమ్మకం మీద దెబ్బతీసేలాగా మాట్లాడినాడు. అవినీతిగా సంపాదించలేకపోవడం వల్లే నేను ఎక్కడలేని ఆదర్శాలకి పోతున్నట్టు చివర్లో అభాండం వేశాడు కూడా.

హమ్మయ్యా! ఇదంతా రాశాక నాకు కొంచెం ఉపశమనం కలిగినట్లుంది. నీ స్పందన ఎట్లా ఉంటుందో నేను ఊహించుకోగలను! నేను ఈ మాత్రం ఆశలతో, ఆశయాలతో ఉంటున్నానంటే నీ ప్రోత్సాహమే కదా! ఉంటాను.

శుభరాత్రి
నీ
సూర్యం"

రాయడం పూర్తిచేసి అట్లా పడుకున్నానో లేదో ఎప్పుడో నిద్రపట్టేసింది. లేచేటప్పటికి ఏడున్నర అవుతోంది-

"రాత్రి ఎప్పుడొచ్చినావో ఏమో... ఒక పొద్దుకాడలేచి చూస్తే ఎందో రాసుకుంటూ ఉంటివి... కొత్త కథ రాసినావా?" అంది వనజ కాఫీ ఇస్తూ..

"ఊహూం నీకు ఉత్తరం రాసినాను" అంటూ పక్కనే టేబుల్ మీద వున్న ఉత్తరాన్ని అందించాను - ఆమెకి.

"నీ యట్లావాళ్లు ఉండల్ల చూడు! ఇంట్లోనే ఉండి జాబులు రాసేది'' అంటూ నవ్వుతూ అందుకుంది. అట్లా ఉత్తరం ఎందుకు రాయాల్సి వచ్చిందో రెండు ముక్కల్లో చెప్పి చదవమన్నాను. కాఫీ తాగేసి బాత్‌రూంకు పోయివచ్చాను.

''బాగుంది అన్నిటికీ అట్ల బాధపడవద్దబ్బా! ఎవరి అభిప్రాయాలు వాళ్లవిలే! మనసులో ఏం పెట్టుకోవద్దు" అన్నది - నా తల వెంట్రుకల్లో వేళ్లు జొనిపి.

❀ ❀ ❀


అదిగో ఇదిగో అన్నట్లే ఏడేళ్లు గడిచిపోయాయి. మా అమ్మాయి ఎంఏ పూర్తిచేసి, ఓ ప్రైవేటు కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తోంది. అబ్బాయి ఎంఏ రెండో ఏడు పూర్తిచేస్తున్నాడు. ఇద్దర్నీ బిఈడి చేయించి టీచర్లుగా చేయాలని నా అభిలాష!

ఉరుము లేకుండా పిడుగు పడ్డట్టుగా మళ్లీ రాజేంద్రగాడు ఈ సాయంత్రం ఫోన్ చేశాడు - మేము ఎప్పుడూ కలుసుకునే సన్మాన్ హోటల్‌కు రమ్మని. నాకెందుకో వాడితో కలవాలంటేనే జంకుగా వుంది. నా పిల్లలతో తన పిల్లల్ని పోలుస్తూ నన్ను ఊరికే నములుకు తింటాడు. పోకుండా ఏదోరకంగా తప్పించుకుందామనుకుంటే... ఒక్కగానొక్క బాల్యమిత్రుడు. ఒకవేళ నేను అక్కడికి వెళ్లకపోతే వాడే ఏకంగా మా ఇంటికి వచ్చేస్తాడు. అప్పుడు ఇక్కడే ఆ నములుడు కార్యక్రమం మొదలుపెడతాడు. పిల్లలిద్దరి ముందూ నా మానాలు తీసేలాగు మాట్లాడినా మాట్లాడతాడు. అందుకే మెల్లగా బయల్దేరాను.

రాత్రి తొమ్మిదిన్నరకల్లా వాడు వదిలిపెట్టాడు. అప్పటికీ నాతల వాచిపోయింది. ఇప్పుడు వాడి పిల్లల్లో పెద్దవాడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. నెలకు యాభైవేల రూపాయల జీతం. చిన్నవాడు అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా సెలక్ట్ అయ్యాడంట. ఈ నెలాఖరుకు అక్కడికే పోతున్నాడంట. వాడికి రాబోయే జీతం నలభైవేల పైవరకూ వుండవచ్చునీ అంచనా. తన గురించి చెప్పుకోవడం బాగానే ఉంది. నా పిల్లల గురించీ వాళ్లు నా పిల్లలవడం వల్ల ఎంత దురదృష్టవంతులయిందీ చెప్పడం నాకు నచ్చలేదు.

"నువ్వు ఎంత రచయితయితే మాత్రం నీ పిల్లలకు ఆ తెలుగూ, ఇంగ్లీషు సాహిత్యాలేమిట్రా చదివించడం!" అంటూ దుయ్యబట్టాడు. 'వాళ్లు నన్ను తిట్టేకాలం ఎంతో దూరం లేద'ని జోస్యం చెప్పాడు. కాలం వాడిది నేనేం చేసేది. అన్నీ భరించి సెలవు తీసుకుని వచ్చేశాను.

ఇంటికి వచ్చాక అన్నం సయించలేదు. వయసు మీద పడ్డం వల్లనేమో ముందు మాదిరి నన్ను నేను సమర్థించుకోలేకపోతున్నా. 'ఊరందరిదీ ఒకదారయితే ఉలిపిరికట్టెది ఒక దారనీ' పిల్లల విషయంలో తప్పు చేశానా? రేప్పొద్దున వాళ్లు నిలదీస్తే, తలవంచుకుని ముద్దాయిలా నిలబడాలా? అనిపిస్తూ ఉంది. నాలోకి నేను కుంచించుకు పోతూ ఉన్నాను. అన్నం తినడం అయిందనిపించిలేచాను. పడకగది




కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

వడ్డేపల్లి వెంకటేష్.

మంచం మీదకు చేరి అన్యమనస్కం గానే సిగరెట్టు కాలుస్తున్నాను. ఇదంతా గమనిస్తూ ఉన్నట్టుంది వనజ. వెంటనే వచ్చింది. పక్కనే కూచుని భుజం మీద చేయి వేసి, నన్నే చూస్తూ "ఎందుకట్ల ఉన్నావ్?" అంది.

విషయాన్నంతా ఏకరువు పెట్టాను. పిల్లలు ఎక్కడ వింటారోనన్న ఆలోచన కూడా లేకుండా ఏమిటట్లా మాట్లాడాను అనిపించింది, అంతా చెప్పాక.

పాప అదోరకంగా నన్ను చూస్తూ అలా గదిలోకి వెళ్లింది. ఆ చూపుకు అర్థమేమిటో తెలీదు. పిలిచి అడిగే ధైర్యం లేదు. వనజ ఏదో ఓదార్పు మాటలు మాట్లాడుతూనే ఉంది. రాత్రి ఎప్పుడో నిద్రపట్టింది.

❀ ❀ ❀

మరుసటి రోజు సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వస్తూనే కాఫీ ఇస్తూ అంది వనజ-

"పాప నీకు ఉత్తరం రాసిందండీ! ఇక్కడే ఎక్కడో పెట్టానని చెప్పింది. వంటిట్లో మిక్సీ శబ్దంలో సరిగా వినబడలేదు." అంటూ వెతకనారంభించింది.

"నాకు ఉత్తరమా, ఎందుకూ?" అన్నాను అనాలోచితంగా.

"ఏమో నాకేం తెలుసు! మధ్యాహ్నం నుంచి తన రూంలో కూచుని రాస్తునే వుంది. తీరా తను సంగీతం క్లాసుకు పోయేటప్పుడు చూసినాను. కండ్లు ఎర్రగా ఏడ్చినట్లున్నాయి. ఎందుకే ఎవరేమన్నారు! అట్లుండాయి నీ కండ్లు? అని అడిగినాను 'ఏం లేదే - ఎవరేమంటారు నన్ను! నాన్నకి ఉత్తరం రాసినా, దాన్నించి కండ్లల్లో నీళ్లు వచ్చినాయి" అనిందిలే! అన్నది వనజ.

ఆ మాట వింటూనే నా గుండె దడదడ లాడింది. కొంపదీసి రాత్రి వాళ్లమ్మతో అన్నమాటలు వినలేదు కదా! ఆవిడ వెతుకుతూనే ఉంది ఉత్తరాన్ని.

'ఈ కొంపలో ఇప్పుడు పెట్టింది ఏదయినా, ఇంక కొంచెం సేపటికి కనబడదు! అంటూ గొణుక్కుంటూ వెతుకుతూ ఉంది.

కుర్చీలో కూర్చునే కళ్ళు మూసుకున్నాను కొంతసేపటికి-

"ఇద్గోనే ఇదే అనుకుంటా" అంటూ ఓ మడత పెట్టిన కాగితాన్ని అందించింది వనజ

కొంత తడబడుతూనే మడత విప్పాను. ఆత్రంగా జేబులో ఉన్న కళ్ళజోడు తీసి పెట్టుకున్నాను.

"అదేదో గట్టిగా చదువు, నేనూ వింటాను." అంది తను నా పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ.

చదవడం మొదలుపెట్టాను.

"నాన్నా!

అప్పుడెప్పుడో నువ్వు ఉత్తరాలు రాసుకునే సంప్రదాయం నశించిపోతోంది, ఒక ఇంట్లో ఉన్న వాళ్ళు ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకోవడం అన్నది సాధ్యపడనప్పుడు ఉత్తరాలు రాసుకునే పద్ధతిని అనుసరిస్తే బాగుంటుందని చెప్పావు. అప్పట్లో అమ్మకు నువ్వు ఒక ఉత్తరం రాశావు. దాని గురించి మేము పెద్దగా పట్టించుకోలేదు. అమ్మ ఈరోజు బీరువాలో దేనికోసమో వెతుకుతూ ఉంటే ఆ ఉత్తరం దొరికింది. చదవమని దాన్ని నాకిచ్చింది అమ్మ. అది చదివాను.

రాత్రి అమ్మతో నువ్వు మాట్లాడుతున్న విషయాలన్నీ విన్నాను. అందుకే ఇప్పుడు ఈ ఉత్తరం రాస్తున్నాను. ఇందులోని భావాలు, ఆలోచనలూ నా ఒక్క దానివేకావు. తమ్మునివి కూడా...

ముందు ఈ క్రింది ప్రశ్నలు నీ ముందు ఉంచుతున్నా-

☆ నువ్వు అందరి నాన్నల మాదిరి ఎందుకు ఆలోచించడంలేదు?
☆ నిజంగా అట్లా ఆలోచించి ఉంటే ఎట్లా ఉండేది, మా స్థాయి ఎంత పెరిగి ఉండేది?
☆ మమ్మల్ని ఇంగ్లీషు మీడియంలో ఎందుకు చదివించలేదు?
☆ అసలు మాకెందుకు ఈ దేశం మీద భక్తి ఉండాలి?
☆ ప్రపంచీకరణ మీద నీకెందుకంత ద్వేషం?
☆ ఇంగ్లీషు మీడియంలో చదివిన విద్యార్థులు ఏ ఉద్యమానికీ చేరరు. ఏకాకిగా బతుకుతుంటారు. తెలుగు మీడియం విద్యార్థులే ఏ ఉద్యమానికయినా 'సై' అంటారు అని నువ్వు ఎప్పుడూ అంటూ ఉంటావు. ఎందుకీ ఉద్యమాలు. అసలు ఆ గొడవ గురించీ ఎందుకు నాన్న నీకు?
☆ అమెరికా మీద నీకెందుకు నాన్నా అంతకోపం?



అది తన ఉత్పత్తుల్ని అన్నిదేశాల్లో అమ్ముకోవడం కోసం ప్రపంచీకరణ పేరుతో ఆయా దేశాల భాషల్ని, సంస్కృతుల్ని నాశనం చేసి, గ్లోబల్ సంస్కృతిగా అమెరికా సంస్కృతినీ, గ్లోబల్ భాషగా ఆంగ్లభాషనూ ప్రవేశపెడుతోందంటూ ఆవేశంగా మాట్లాడేవాడివి. మాకూ ఆ భావాలన్నీ నూరిపోశావు ఎందుకు?

వీటన్నింటికీ జవాబులు మాకు తెలుసునని నీకూ తెలుసు. మరెందుకు రాస్తున్నానంటే అది చివర్లో చెబుతాను. రాజేంద్ర బాబాయి దేశంలో అందరి నాన్నల లాంటివాడు. ఆయనకి తన పిల్లల బాగోగులు మాత్రమే తెలుసు. వాళ్లు పెరిగి పెద్దయి డబ్బు సంపాదించే యంత్రాలయితే అంతకంటే ఆయనకి ఇంకేమీ అవసరం లేదు. అందుకే 'నీ పిల్లలు నిన్ను తిడతారు. క్షమించరు' అన్నాడు.

నీ పిల్లలు నిజంగా ఏమి తెలియని వాళ్లయితే నిన్ను కేవలం తిడతారు. మూర్ఖులయితే క్షమించరంతే!

అయితే నాన్నా!

రాజేంద్రబాబాయి లాంటి నాన్నల్ని తర్వాతి తరాల వాళ్లు ఏనాటికీ క్షమించరు!

భావోద్వేగంతో రాస్తున్నందువల్లనేమో నాన్న! ఉత్తరం రాస్తున్నంత సేపు ఏడ్చాను. వీటినే ఆనందభాష్పాలు అంటారేమో. నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తూ

నీ కూతురు
అంకిత"

నా కళ్లల్లోనూ నీళ్ళు! గర్వంతో పొంగిన నీళ్ళు! ఉబికి ఉబికి వస్తున్నాయి...

## కాలమే చెప్పాలి

**ఎల్.ఆర్. స్వామి**

ఇది ఒక మజిలి,
ఆరు పదుల సంవత్సరాల
ఆవర్తనా యాత్రలో
ఈ ఉగాది ఒక మజిలి
నేడు,
చుక్కైనా మెరవని అమావాస్య చీకటిలో
శుక్లాలు నిండిన కనుపాపలని
చొచ్చుకుపోనిచ్చి,
రాలని చినుకుకోసం నిరీక్షించే
చాతక పక్షిలా,
కురవని వెన్నెలకోసం ఎదురు చూసే, నేను
అమాయకుడినా, ఆశావాదినా,
ఏమో, కాలమే చెప్పాలి.
స్వార్థపూరిత జీవితపు మరకలు
స్ఫోటకం మచ్చలుగా మారిన
ఈ మజిలీల గోడల మధ్య నిలిచి
అనుభవాలని నెమరు వేస్తున్నాను.
అవును, మరి! నెమరు వేస్తున్నాను
మనిషి మోము తొడిగిన
పొడిచే పశువుని కదా, నేను!
జీవితానుభవాల సాగరాన్ని
జల్లెడ పడితే మిగిలినదేమిటి?
ముత్యాలు కావు, రత్నాలుకావు,
ఇసుక, ఉత్త ఇసుక!
తను వేడెక్కి అరికాళ్ళకి
మంటనెక్కించే ఇసుక!
విడిపోతూ తనకోసమే
బ్రతికే ఇసుక!
నల్లపర్దాలు తొడిగిన మబ్బులు
వెలుగుల సూర్యకిరణాలని
హతమార్చిన నెత్తురుతో
తిలకం దిద్దుకున్న సంధ్యని దాటి
ఇచ్చట, చీకటిలో
స్వార్థ యుద్ధాలకు, గూఢ యుద్ధాలకు
బలైన మానవత్వపు కళేబరాల
పునాదిపై వెలసిన ఈ మజిలీలో
మానవత్వపు వెన్నెలకోసం
ఎదురుచూసే నేను,
అమాయకుడినా, ఆశాజీవినా?
ఏమో, కాలమే చెప్పాలి
రేపటి ఉదయం
ఉగాది (యుగాది) యట!
ఏదో మార్పు వస్తుందట!
ఆశయేమో, మరి, కాని
ఆశయేగా, జీవితానికి పునాది!
ఈ ఉగాది ఒక నూతన
యుగాది కావచ్చేమో!
మనిషి స్వార్థాన్ని గతిస్తాడేమో!
మానవత్వానికి పట్టం కడుతాడేమో!
కాలమే చెప్పాలి.